క్లుప్తంగా

జాబ్ చార్ట్ ప్రకారం విధులు కేటాయించండి


రాయవరం ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

రాయవరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు జాబ్ చార్ట్ ప్రకారం మాత్రమే విధులు నిర్వహిస్తామని, ఆ విధంగా విధులు కేటాయించాలని సచివాలయ, వార్డు సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. శనివారం రాయవరం ఎంపీడీవో కీర్తి స్పందనకు వినతిపత్రం అందజేశారు. సచివాలయ ఉద్యోగులుగా తాము పడుతున్న బాధలను పై అధికారులకు తెలియజేసినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోగా రోజురోజుకు ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని మరింత దిగజారుస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో వలంటీర్లు ఒక క్లస్టర్‌కు పరిమితమై నిర్వహించిన విధులను సచివాలయ ఉద్యోగులు ఒకటికి మించి అధిక క్లస్టర్స్‌ను మ్యాప్ చేసి బలవంతంగా ఇంటింటికీ తిరిగే విధులను అప్పగిస్తున్నారన్నారు. తాము ప్రభుత్వానికి వ్యతిరేకం కానప్పటికీ, ఇంటింటికీ తిరిగి చేసే సర్వేలకు మాత్రం వ్యతిరేకమంటూ వారు ఎంపీడీవోకు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నారు.

అన్నదానానికి విరాళం

కపిలేశ్వరపురం: మండలంలోని అంగరలో గ్రామ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్ర ఉత్సవాల సందర్భంగా నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి రూ.2 లక్షలు విరాళం అందింది. అదే గ్రామానికి చెందిన కంకటాల వెంకటేశ్వరరావు, సీతామహాలక్ష్మి దంపతుల జ్ఞాపకార్థం కుమారులు కంకటాల వెంకట మల్లేశ్వరరావు, సుబ్బలక్ష్మి దంపతులు, కంకటాల నాగబాబు, లక్ష్మీరత్నం దంపతులు చెరొక రూ.లక్ష చొప్పున విరాళం అందజేశారు. వారిని సంఘం నాయకులు అభినందించారు.

పీహెచ్‌సీ తనిఖీ


పామర్రు పీహెచ్‌సీ రికార్డులు పరిశీలిస్తున్న దుర్గారావు దొర

కె.గంగవరం: మండలంలోని పామర్రు పీహెచ్‌సీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ దుర్గారావు దొర సందర్శించారు. తొలుత పీహెచ్‌సీకి సంబంధించిన రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం వ్యాధి నిరోధక టీకాలు, గర్భిణీల నమోదు, ఆసుపత్రిలో ప్రసవాల వివరాలు, ఈహెచ్‌ఆర్ తదితర అంశాల మీద రివ్యూ నిర్వహించి వైద్యాధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, పబ్లిక్‌తో సత్సంబంధాలు ఉండాలన్నారు. మెరుగైన వైద్యం అందించడంతో పాటు రోగులకు పౌష్టిక ఆహారంపై కూడా అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో స్టాఫ్ కొరతపై ఆయన దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమించే ఏర్పాట్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు పోలిశెట్టి హర్షిత, విష్ణువర్ధన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన


రోడ్డు నిర్మాణ పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని 26, 27 వార్డుల్లో రూ.36 లక్షల మున్సిపల్ నిధులతో సీసీ రహదారుల నిర్మాణ పనులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి విడివిడిగా శనివారం పరిశీలించారు. నిర్మాణ పనుల నాణ్యతలో రాజీపడరాదని చైర్‌పర్సన్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

పంట తెగుళ్లపై శ్రద్ధ వహించాలి

కాజులూరు: పంట తెగుళ్లపై రైతులు తొలిదశ నుంచే తగిన శ్రద్ధ వహించాలని మండల వ్యవసాయాధికారి అశోక్ అన్నారు. శనివారం మండలంలోని గొల్లపాలెంలో ఆయన క్షేత్ర స్థాయిలో పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరిసాగులో పంట తొలిదశ నుంచే మేలైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే నాణ్యమైన అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వాతావరణ మార్పులతో పంట వ్యాధులు, తెగుళ్ల బారిన పడుతుందని, రైతులు అవగాహనతో తగిన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మండల గ్రామాల్లో వరి పంట దుబ్బు కట్టే దశలో ఉందని, ఈ దశలో పైరుకు పొటాష్ ఎరువు తప్పనిసరిగా వేయాలన్నారు. వీఏఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కపిలేశ్వరపురం (మండపేట): నియోజకవర్గంలోని పలువురు బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం మండపేటలో వారికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అందజేశారు. నియోజకవర్గంలోని 38 మందికి రూ.18.55 లక్షలు విలువైన చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు.

పరిమిత ప్రవేశాలు

- డిగ్రీ నోటిఫికేషన్ జారీలో తీవ్ర జాప్యం
- ఇంజినీరింగ్ వైపు విద్యార్థుల దృష్టి
- పరిమిత ప్రవేశాలతో తరగతులకు సన్నద్ధం

కపిలేశ్వరపురం: కూటమి ప్రభుత్వం ఉన్నత విద్యను నిర్లక్ష్యం చేస్తోంది. డిగ్రీ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో విద్యార్థుల్లో ఆందోళనలతోపాటు గందరగోళం నెలకొంది. డిగ్రీ ప్రవేశాల నోటిఫికేషన్ జారీలో ప్రభుత్వ జాప్యం కారణంగా విద్యార్థులు కొన్ని నెలలపాటు డిగ్రీ చదువుకు దూరమవుతున్నారు. నోటిఫికేషన్ విడుదల కాక కొందరు ఇంజినీరింగ్ వైపు వెళ్లిపోతున్నారు. ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ 12న, సప్లిమెంటరీ ఫలితాలు జూన్ 8న విడుదలయ్యాయి. జూన్ 12న పాఠశాలలు, 1 నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభమయ్యాయి. కానీ, ఇంటర్ ఫలితాలు విడుదలై 4 నెలలు పైబడినప్పటికీ డిగ్రీ క్లాసులు నేటికీ ప్రారంభం కాలేదు. ప్రభుత్వ జాప్యం కారణంగా డిగ్రీ చేరికలు ప్రారంభమైనప్పటికీ అందులో చేరే విద్యార్థుల సంఖ్య అంతంత మాత్రంగానే ఉంది.

సందిగ్ధం.. సాగదీత

డిగ్రీ కోర్సులకు సంబంధించి సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానం అమలు చేయాలా?, డబుల్ మేజర్ సబ్జెక్ట్ విధానాన్ని అమలు చేయాలా? అన్న సందిగ్ధతను కూటమి ప్రభుత్వం సాగదీయడంతో నోటిఫికేషన్ జారీలో తీవ్ర జాప్యం నెలకొంది. 2023–24లో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జాతీయ విద్యా విధానంలో భాగంగా సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానాన్ని తీసుకొచ్చింది. విశ్వ విద్యాలయాల నిధుల సంఘం ఇటీవల డబుల్ మేజర్ సబ్జెక్టు విధానం అమలుకు అనుమతి ఇచ్చింది. దీంతో కళాశాలలు సింగిల్ నుంచి డబుల్‌కు మారేందుకు దరఖాస్తు చేసుకున్నాయి. అయితే, కొందరు అధికారులు సింగిల్ మేజర్ సబ్జెక్ట్ విధానం ఉండాలని, యూనివర్సిటీ అధికారులేమో డబుల్ మేజర్ సబ్జెక్ట్ విధానం మేలు అంటూ తర్జన భర్జనలు పడ్డారు.


మండపేటలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ఎట్టకేలకు షెడ్యూల్ ఖరారు..

2025– 26 విద్యా సంవత్సరానికి తీవ్ర జాప్యం తర్వాత సెప్టెంబర్ 1న ఏపీ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి షెడ్యూల్‌ను ఖరారు చేసింది. సెప్టెంబర్ వరకూ చేరికల నమోదు, 4లోపు వెబ్ ఆప్షన్స్ నమోదును నిర్దేశించింది. సెప్టెంబర్ 1 నుంచి 3 మధ్య స్పెషల్ కేటగిరీ పత్రాల పరిశీలన, 5న వెబ్ ఆప్షన్ల మార్పునకు అవకాశం ఇచ్చింది. 8న సీట్లు కేటాయించి, 9 నుంచి తరగతులను ప్రారంభించేలా నోటిఫికేషన్ ఇచ్చింది.

అందుబాటులో ఉన్న కళాశాలలివీ

రెండు నియోజకవర్గాల విద్యార్థులు మండపేట, రామచంద్రపురంతో పాటు రావులపాలెం, ఆలమూరులోని కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతుంటారు. జిల్లాలో వాటితో పాటు అమలాపురం, కొత్తపేట, ముమ్మిడివరం, రాజోలులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలున్నాయి. మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సుల్లో మొత్తం 320 సీట్లు,


నిష్ణాతులైన కళాశాల అధ్యాపక బృందం

రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 360 సీట్లు ఉన్నాయి. ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని ఉభయగోదావరి జిల్లాల్లోని కళాశాలల పరిధిలో 32 వేల సీట్లు భర్తీ కాగా.. జిల్లాలో సుమారు 2,800 సీట్లు కేటాయించారు.

ప్రత్యేకతలు ఇవే..

మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల నాక్, యూజీసీ గుర్తింపు పొందింది. కళాశాలలో 22 పోస్టులు మంజూరులో ఉండగా 8 మంది శాశ్వత అధ్యాపకులు, 14 మంది కాంట్రాక్ట్ బోధన చేస్తున్నారు. నాన్ టీచింగ్ కాంట్రాక్ట్ సిబ్బందిగా 9 మంది సేవలందిస్తున్నారు. ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో కళాశాల అన్ని వసతులతో ఉంది. ఇండోర్ స్టేడియం, అవుట్ డోర్ క్రీడా మైదానం ఉన్నాయి. కెమిస్ట్రీ, ఫిజిక్స్, కంప్యూటర్ కోర్సులకు సంబంధించిన ల్యాబ్‌లున్నాయి. 100 ఎంబీపీఎస్ వేగం గల ఇంటర్నెట్, వైఫై సౌకర్యం ఉచితంగా ఉపయోగించుకోవచ్చు. దాతల సహకారంతో నిర్మితమైన ఏసీ గ్రంథాలయంలో డిగ్రీ సంబంధిత పుస్తకాలతో పాటు పోటీ బ్యాంకింగ్, సివిల్స్ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. పట్టణంలో బీసీ బాలికలు, బాలుర వసతి గృహాల్లో ఉచిత వసతి, బస్ పాస్ సౌకర్యం, ఫీజు రీయింబర్స్‌మెంట్ మినరల్ వాటర్ ప్లాంటు ఉన్నాయి.

జిల్లా నలుమూలలకు చేరికలు

డిగ్రీ విషయంలో నాణ్యతతో పాటు ఉపాధి అవకాశాలను బేరీజు వేసుకుని చేరుతారు. ఇంటర్ వరకూ స్థానికంగా ఉన్న విద్యాలయాల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతారు. జిల్లాల్లో ప్రభుత్వ, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ కళాశాలలు 53 ఉండగా వాటిలో మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలున్నాయి. ఈ ఏడాది జిల్లాలో 2024–25 సీనియర్ ఇంటర్ ఫలితాల్లో 12,825 మందికి 9,246 మంది, తర్వాత సప్లిమెంటరీ ఫలితాల్లో మరికొందరు విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. జిల్లాలో గతేడాది ఆలస్యం కారణంగా 10వేల మంది మాత్రమే డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరగా.. 30 శాతం సీట్లు మిగిలిపోయాయి. ఈ ఏడాది సైతం కూటమి ప్రభుత్వం అదే తరహాలో జాప్యం చేసింది.

కోర్సుల వివరాలు

మండపేట డిగ్రీ కళాశాలలో బీఏ ఎకనామిక్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీలో బోటని, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ మ్యాథ్స్, కెమిస్ట్రీ, బోటని, ఆక్వాకల్చర్, బీఏలో ఎకనామిక్స్, స్పెషల్ తెలుగు, బీకాంలో జనరల్, కంప్యూటర్ అప్లికేషన్స్, ఎకనామిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

కళా ఉత్సవ్ పోస్టర్ ఆవిష్కరణ

రామచంద్రపురం: బొమ్మూరులో ప్రభుత్వ జిల్లా విద్య, శిక్షణ సంస్థ వద్ద ఈనెల 11,12 తేదీల్లో జరిగే కళా ఉత్సవ్– 2025 కార్యక్రమంలో విద్యార్థులు ఎక్కువ మంది పాల్గొనే విధంగా ప్రధాన ఉపాధ్యాయులు కృషి చేయాలని రామచంద్రపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ప్రత్తి రామలక్ష్మణ మూర్తి అన్నారు. స్థానిక డీవైఈఓ కార్యాలయంలో శనివారం కళా ఉత్సవ్ 2025 పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న డైట్ ఫిజిక్స్ లెక్చరర్ శ్రీకృష్ణసాయి మాట్లాడుతూ, ఈ కార్యక్రమంలో 9 నుంచి 12వ తరగతి వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు అర్హులని తెలిపారు. ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదని, విద్యార్థులకు గాత్ర సంగీతం, వాయిద్య సంగీతం, నృత్యం, నాటక కళలు, సాంప్రదాయ కథనం వంటి అంశాలపై పోటీలు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు డైట్ బొమ్మూరు ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీవైఈవో రామలక్ష్మణమూర్తి తదితరులు

డిసెంబర్ 31 నుంచి సీఐటీయూ మహాసభలు

రామచంద్రపురం: డిసెంబర్ 31 నుంచి జరిగే ఆలిండియా సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని చెలికాని రామారావు స్మారక భవనంలో అంగన్‌వాడీ కార్మికులు రామచంద్రపురం ప్రాజెక్టు రెండో మహాసభలను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ, అంగన్వాడీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణవేణి మాట్లాడుతూ, అంగన్వాడీలు 42 రోజుల సమ్మె చేసి తమ డిమాండ్స్ సాధించుకుంటున్నారన్నారు. నిత్యవసర ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. యాప్‌ల వల్ల ఇబ్బంది పడుతున్నారని, వాటిని రద్దు చేయాలన్నారు. అంగన్వాడీలకు వేసవి సెలవులు, సంక్షేమ పథకాలను ఇవ్వాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మహాసభలో అంగన్‌వాడీ కార్మికులు నూతన కమిటీ గౌరవ అధ్యక్షులుగా నూకల బలరామ్ (సీఐటీయూ) అధ్యక్షులుగా ఉప్పులూరి వీరలక్ష్మి, ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ, వర్కింగ్ అధ్యక్షులు వాసంశెట్టి సూర్య కుమారి, ఉపాధ్యక్షులుగా జహర, చంద్రకళ, కార్యదర్శులుగా వెంకటరత్నం, సుధా, కోశాధికారిగా దుర్గ, కమిటీ నంబర్లుగా లక్ష్మీరత్నం, కనకదుర్గ, కుంతీ దేవి ఎన్నికయ్యారు.


మహాసభల్లో పాల్గొన్న అంగన్‌వాడీ కార్మికులు

నల్ల బ్యాడ్జీలతో సచివాలయ ఉద్యోగుల నిరసన

ఆలమూరు: రాష్ట్ర గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాల్లోని సచివాలయ ఉద్యోగులందరూ ప్రభుత్వం తీసుకుంటున్న పక్షపాత వైఖరి, అనవసర యాప్‌లను తొలగించాలని కోరుతూ తమ నిరసన తెలియజేశారు. అందులో భాగంగా సచివాలయ ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి ఆయా గ్రామ సచివాయాల్లో శనివారం విధులకు హాజరయ్యారు. మధ్యాహ్న భోజనం విరామ సమయంలో ఆలమూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో ఎ.రాజుకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే తొలుత ఆయా గ్రామ సచివాలయాల వద్ద తాము ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి తమ ఆత్మాభిమానాన్ని కాపాడాలంటూ సంతకాలు చేసిన పత్రాలను కార్యదర్శులకు అందజేశారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల వ్యతిరేక వైఖరిని ప్రభుత్వం విడనాడకుంటే భవిష్యత్ నిరసన కార్యక్రమాన్ని ప్రకటిస్తామని వారు హెచ్చరించారు. గ్రామ సచివాలయాల ఉద్యోగులను వేధించడం తగదని ఆవేదన చెందారు.

లో వోల్టేజీ సమస్యకు పరిష్కారం

రామచంద్రపురం రూరల్: మండంలోని మేజర్ పంచాయతీ ద్రాక్షారామలో బియ్యంపేట, మండాలమ్మపేట వాసులు చాలా కాలంగా లో వోల్టేజీ సమస్యతో రాత్రిళ్లు కరెంటు పూర్తిగా లేక దోమల మోతతో నిద్రకు దూరమయ్యేవారు. ఏపీఈపీడీసీఎల్ ఏఈ మేడిశెట్టి వెంకటరమణ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడంతో ఆయన మండాలమ్మపేట, ద్రాక్షారామ పీహెచ్‌సీల వద్ద అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వినాయకా..వీడుకోలిక

- గంగమ్మ ఒడికి చేరిన గణనాథులు
- కోలాహలంగా లంబోదరుడి నిమజ్జనం
- జనసంద్రంగా మారిన కోటిపల్లి

రాయవరం: గణపతి నవరాత్ర ఉత్సవాలు చివరి దశకు చేరుకున్నాయి. భక్తులు బొజ్జ గణపయ్యలను వైభవంగా సాగనంపుతున్నారు. నవరాత్రులు గురువారంతో పూర్తయ్యాయి. 10వ రోజు శుక్రవారం కావడంతో అధిక సంఖ్యలో ఉత్సవ కమిటీలు శనివారం ఏకదంతుడి నిమజ్జనోత్సవాలు అట్టహాసంగా నిర్వహించారు. గణనాథుడికి ఉద్వాసన పలికిన అనంతరం విగ్రహాలను ప్రత్యేక వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రత్యేకమైన దుస్తులు ధరించిన యువకులు సంగీతానికి అనుగుణంగా నృత్యాలు చేస్తూ.. రంగులు చల్లుకుంటూ.. భారీగా బాణసంచా కాలుస్తూ స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. రాయవరం, లొల్ల, మాచవరం, సోమేశ్వరం, వెదురుపాక, పసలపూడి, చెల్లూరు, వెంటూరు తదితర గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించి ఆయా గ్రామాల్లోని కాలువల్లో వినాయకుడి ప్రతిమలను నిమజ్జనం చేశారు.


మండపేటలో వినాయకుని ప్రతిమను నెత్తిన మోస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

కె.గంగవరం: నియోజకవర్గంలోని కె.గంగవరం మండలం, రామచంద్రపురం రూరల్ మండలాల్లోని పలు గ్రామాల్లో కొలువైన గణేష్ విగ్రహాలను కోటిపల్లిలోని గౌతమి గోదావరిలో నిమజ్జనం చేసేందుకు శనివారం ఉదయం నుంచి భక్తులు పోటీపడ్డారు. దీంతో కోటిపల్లి గ్రామం కోలాహలంగా మారింది. గ్రామ ప్రారంభం నుంచి రేవు వరకు డప్పులు, నృత్యాలు, బాణసంచాలతో భారీ ఊరేగింపుతో రేవులోకి చేరుకొని అనంతరం చివరి పూజ నిర్వహించి నిమజ్జనం చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి అపశ్రుతి జరగకుండా స్థానిక ఎస్సై జానీబాషా బందోబస్తు నిర్వహించి వినాయక శిబిర నిర్వాహికులకు దిశదశ నిర్దేశించారు. భారీ విగ్రహాలను చూసేందుకు ప్రజలు రావడంతో కోటిపల్లి– కె.గంగవరం రహదారి జనసంద్రంగా మారింది. కూళ్ల నుంచి బ్రహ్మపురి వరకు గోదావరి ఏటిగట్టుపై పోలీసుల పహారీ నిర్వహించి భక్తులు గోదావరిలోకి దిగకుండా బందోబస్తు నిర్వహించారు. రేవులోనే ప్రాథమిక వైద్య కోసం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి అనారోగ్యానికి గురైన భక్తులకు వైద్యం అందించారు.

ఆర్డీఓ పర్యటన

రామచంద్రపురం ఆర్డీఓ అఖిల కోటిపల్లిలో పర్యటించారు. నిమజ్జనం జరిగే ప్రాంతాన్ని పరిశీలించి పోలీసులు, రెవెన్యూ, పంచాయితీ సిబ్బందికి సూచనలు చేశారు. రేవులో ప్రమాదకరంగా ఉందని, భక్తులు గోదావరిలో దిగి పుణ్యస్నానాలు ఆచరించకుండా గట్టున ఏర్పాటు చేసిన జల్లు స్నాన ఘాట్టాన్ని ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాద్, సర్పంచ్ పెమ్మాడి బేబి సత్తిబాబు, పలు గ్రామాల వీఆర్‌ఓలు, పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మండపేట నియోజకవర్గంలో వినాయక నవరాత్రుల్లో ఆఖరి గట్టమైన నిమజ్జనోత్సవం వైభవంగా నిర్వహించారు. మండపేట పట్టణం, రూరల్, రాయవరం, కపిలేశ్వరపురం మండలాల్లోని గ్రామాల్లో నిమజ్జన ర్యాలీలు ఉత్సాహంగా సాగాయి. పుణ్య గౌతమి గోదావరి వెంబడి కపిలేశ్వరపురం మండలం తాతపూడి, కపిలేశ్వరపురం, కోరుమిల్లి, వాకతిప్ప పుష్కర ఘాట్‌లో పలు ప్రాంతాల నుంచి తరలించిన విగ్రహాలను నిమజ్జనం చేశారు. మండపేట సీఐ పి.దొరరాజు, తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఎంపీడీఓ జి.రాజేంద్ర ప్రసాద్, ఎస్సై హరీష్‌కుమార్ పర్యవేక్షణలో గోదావరి రేవులతో పాటు పంట కాలువల వద్ద ఏర్పాట్లు చేశారు. గోదావరి తీర గ్రామాలతో పాటు అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, వల్లూరు, నేలటూరు, నిడసనమెట్ట, అచ్యుతాపురం, వడ్లమూరు, నల్లూరు, కాలేరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగులచెరువు, అద్దంకివారిలంక, కేదారిలంక గ్రామాల్లోని శిబిరాల నుంచి విగ్రహాలను ఊరేగింపుగా తరలించి నిమజ్జనం చేశారు.


గౌతమి గోదావరిలో విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు తీసుకెళ్తున్న భక్తులు

మండపేట పట్టణంలో..

సైదులు పేటలో స్నేహ యూత్ ఆధ్వర్యంలో లక్ష్మీగణపతి నవరాత్ర శిబిరం పూజల్లో వైఎస్సార్ సీపీ నాయకుడు, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ పాల్గొన్నారు. 15వ వార్డు ధర్మగుండం వీధిలోని సంతాన గణపతి, 4వ వార్డు తర్వాణిపేటలోని వరసిద్ధి వినాయక ఉత్సవ శిబిరాల్లోని పూజా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ నూక దుర్గారాణి హాజరై స్వామి విగ్రహాన్ని నెత్తిన పెట్టుకొని ఊరేగించారు.

మండపేట రూరల్ మండలంలో...

మారేడుబాక, ఏడిద, ఏడిద సీతానగరం, తాపేశ్వరం, ద్వారపూడి, ఇప్పనపాడు, పాలతోడు, వెలగతోడు, మెర్నిపాడు, జెడ్ మేడపాడు, కేశవరం తదితర గ్రామాల్లో నిమజ్జన ఉత్సవాలు వైభవంగా సాగాయి. కేశవరంలోని భక్తాంజనేయ స్వామి ఆలయ సమీపంలోని వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవానికి వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దూలం వెంకన్నబాబు హాజరయ్యారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో నెలకొల్పిన వినాయకుని ప్రతిమలు శనివారం భారీ ఊరేగింపుతో నిమజ్జనానికి తరలించారు. వెలంపాలెం, కంబాలచెరువు, ద్రాక్షారామ ఆటోస్టాండ్, జగన్నాయకులపాలెం, తాళ్లపొలం, శుక్రవారపుపేట, బియ్యంపేట, ఉండూరు, వెంకటాయపాలెం తదితర గ్రామాల్లో నెలకొల్పిన గణేశుని విగ్రహాలను ఊరేగింపుగా కోటిపల్లికి తరలించి గోదావరిలో నిమజ్జనం చేశారు. కొన్ని గ్రామాల్లోని వినాయకుని ప్రతిమలను వెల్ల ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు. ద్రాక్షారామ ఎస్సై లక్ష్మణ్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కాజులూరు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం వినాయక విగ్రహాలను పూజల అనంతరం గ్రామ వీధుల్లో గారడి, కోలాటం, కోయసంబరాలతో ఊరేగించి తుల్యభాగ, ఆత్రేయ గోదావరి, పలు ప్రధాన కాలువల్లో నిమజ్జనం చేశారు. మండలంలోని గొల్లపాలెం, మొగలిపాలెం, ఆర్యావటం, జగన్నాథగిరి, కోలంక తదితర గ్రామాల్లో నిర్వాహక కమిటీల ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనాలు జరిగాయి.


కోటిపల్లి గోదావరి వద్ద నిమజ్జనాలను పరిశీలిస్తున్న ఆర్డీఓ అఖిల


కోటిపల్లిలో రేవు వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్సై జానీ బాషా

మాజీ ఉపరాష్ట్రపతికి విగ్రహం బహూకరణ


వెంకయ్యనాయుడుకి విగ్రహాన్ని అందజేస్తున్న శ్రీనివాస్

కపిలేశ్వరపురం (మండపేట): మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకి మండపేట గ్రామానికి చెందిన శ్రీరామకృష్ణా బ్రాస్ అండ్ సిల్వర్ వర్క్స్ యజమాని వాసా శ్రీనివాసరావు పంచ లోహాలతో తయారు చేసిన బాలరాముని విగ్రహాన్ని బహూకరించారు. గన్నవరం స్వర్ణ భారత్ ట్రస్ట్ భవన్‌లో శనివారం మర్యాదపూర్వకంగా కలిసి విగ్రహాన్ని అందజేశారు.

నేడు 'మీట్ యువర్ డీఎస్పీ'

రాయవరం: రామచంద్రపురం సబ్ డివిజన్ పోలీస్ ఆఫీసర్ కార్యాలయం వద్ద 'మీట్ యువర్ డీఎస్పీ' కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని రాయవరం ఎస్సై డి.సురేష్‌బాబు శనివారం విలేకరులకు తెలిపారు. ఏమైనా సమస్యలు, ఫిర్యాదులు చేయాలనుకునే వారు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రామచంద్రపురం డీఎస్పీ కార్యాలయంలో నేరుగా వినతిపత్రాలు అందజేయవచ్చని తెలిపారు. డీఎస్పీ నేరుగా సమస్యలు విని వాటి సత్వర పరిష్కారానికి కృషి చేస్తారని ఆయన పేర్కొన్నారు.

నేడు భీమేశ్వరాలయం మూసివేత

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయం ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు నివేదన పూర్తి చేసిన తరువాత మూసివేయనున్నట్లు ఆలయ ఈఓ, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాహుగ్రస్త సంపూర్ణ చంద్ర గ్రహణం ఏర్పడుతున్న కారణంగా ఉన్నతాధికారుల సూచన మేరకు దేవాలయం మూసివేస్తున్నట్లు ఆమె తెలిపారు. సోమవారం ఉదయం పుణ్యాహవచనాది కార్యక్రమాలు పూర్తి చేసి 7.30 గంటలకు సర్వదర్శనాలకు అనుమతించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు ఈ మార్పును గమనించాలని కోరారు.

సోమేశ్వరుని ఆలయం మూసివేత

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లిలో కొలువైన శ్రీఛాయా సోమేశ్వర స్వామి ఆలయం ఆదివారం ఉదయం 11 గంటలకు మూసివేస్తామని ఆలయ ఈఓ భీమశంకరం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాహు గ్రస్త సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సోమవారం ఉదయం 7 వరకు స్వామి, అమ్మవార్ల దర్శనాలకు భక్తులను అనుమతించమని పేర్కొన్నారు. చంద్రగ్రహణం అనంతరం సోమవారం ఉదయం స్వామి, అమ్మవార్లకు సంప్రోక్షణ అనంతరం యాథావిధిగా దర్శనాలు కల్పిస్తామని, భక్తులు గమనించాలని ఆయన కోరారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం


విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న గ్రామస్తులు

కపిలేశ్వరపురం (మండపేట): మండలంలోని ఏడిద ఎంపీపీ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, బూరిగ రామారావును ఘనంగా సత్కరించారు. వైస్ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, హెచ్ఎం ముత్యాల వెంకటేశ్వరరావు, గెడా శ్రీనివాస్, పర్వతిన వీర్రాజు తదితరులు మాట్లాడుతూ, మెరుగైన సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు చేసిన కృషి అత్యంత కీలకమైనదన్నారు.

షాపుల్లో తనిఖీలు

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణ మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు ఆధ్వర్యంలోని సిబ్బంది పట్టణంలోని 20 షాపులను తనిఖీ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సరకులు వినియోగంపై నిఘా ఉంచే కార్యక్రమంలో భాగంగా తనిఖీ చేశారు. ఏడు షాపుల నుంచి నిషేధిత ప్లాస్టిక్ సరుకులను స్వాధీనం చేసుకున్నారు. రూ.6,650 జరిమానా విధించారు. ఆలమూరు రోడ్డులోని శ్రీవేంకటేశ్వర హాట్ చిప్స్ షాపులో రెండున్నర కేజీల ప్లాస్టిక్ క్యారీ బేగ్స్‌ను స్వాధీనం చేసుకొని రూ.5 వేలు జరిమానా విధించారు. పలు షాపుల నుంచి 12 కేజీల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, 10 కేజీల ప్లాస్టిక్ క్యారీ బేగ్‌లు, 500 ప్లాస్టిక్ గ్లాసుల ప్యాకెట్లును సీజ్ చేసినట్టు సత్తిరాజు తెలిపారు.